మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద



- నేడు బుద్ధభవన్‌లో బాధ్యతల స్వీకరణ

కరీంనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం నేరెళ్ల శారదను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్‌లోని బుద్ధభవన్‌లో ఆమె ఉదయం 10 గంటలకు బాధ్యతలను స్వీకరించనున్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందే 37 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమిస్తూ మార్చి 15న జీవో ఆర్‌టీ 445 జారీకాగా ఎన్నికల కారణంగా పెండింగ్‌లో పడిపోయింది. ఇదే సమయంలో ఈ నియామకాలపై కొన్ని అభ్యం తరాలు వ్యక్తం కావడంతో ఎన్నికల తర్వాత కూడా ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని పెండింగ్‌లో పెట్టింది.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇతర మంత్రులతో కలిసి ఇటీవల ఢిల్లీ వెళ్లి జాతీయ నాయకత్వంతో చర్చలు జరిపి ఈ నియామ కాలకు ఆమోదముద్ర వేయించు కున్నారు. దీనితో ఈనెల 8న మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా 35 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమిస్తూ పెండింగ్‌లో పెట్టిన జీవోను విడుదల చేశారు. గతంలో ఈ నియా మకాలలో 37 మందికి పదవులు లభించగా అందులో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవి పొందిన జిల్లాకు చెందిన మహిళా కాంగ్రెస్ నేత, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు నేరెళ్ల శారదకు అవకాశం కల్పించారు. 35 మందికి మాత్రమే నియామకాలు ఇస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. గవర్నర్ ఆమోద ముద్ర కోసం మహిళా కమిషన్ చైర్మన్ పదవికి జీవో వెలువడలేదు. తాజాగా మంగళవారం ప్రభుత్వం మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారదను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆమె పదవీ బాధ్యతలను స్వీకరించను న్నారు. క్రియాశీల కార్యకర్తగా పార్టీకి విధేయతతో చాలా కాలంగా పనిచేస్తూ పార్టీ పటిష్టతకు వివిధ హోదాల్లో కృషిచేసిన నేరెళ్ల శారద మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవి కట్టబెట్టారు. పార్టీ పటిష్టతకు కృషి చేసిన కాంగ్రెస్‌పార్టీ విధేయతకు పదవులను ఇచ్చి సముచిత ప్రాధాన్యం కల్పించినట్లయింది. మహిళా కమిషన్ చైర్మన్‌గా నియా మకమైన నేరెళ్ల శారద 2001లో రామడుగు జెడ్పీటీసీగా, టీపీసీసీ మహిళా విభాగం అధ్యక్షురాలుగా, జిల్లా అధ్యక్షురాలుగా, కరీంనగర్ జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ రీజనల్ చైర్‌పర్సన్‌గా గతంలో పనిచేశారు. కాంగ్రెస్‌పార్టీ అధినేత్రి సోనియాగాంధీ వద్ద నేరెళ్ల శారదకు మంచి గుర్తింపు ఉంది. ఆమె జిల్లా కాంగ్రెస్ పార్టీలో సీనియర్ మహిళా నాయకురాలుగా ఉన్నారు. గత కొంత కాలంగా నేరెళ్ల శారద హైదరాబాద్‌లోనే ఉంటూ కాంగ్రెస్ పార్టీలో వివిధ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలను స్వీకరించనున్న నేరెళ్ల శారదకు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలిపారు.

షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

భగత్‌నగర్, జూలై 16: రాష్ట్ర ప్రభుత్వం రైతుల రుణమాఫీ షరతులు లేకుండా అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 567లో రైతుల రుణ మాఫీకి రూపొందించిన నిబంధ నల లోని అంశాలను సవరించి రెండు లక్షల వరకు రుణం పొందిన రైతులకు లబ్ధి కలిగేలా మార్గదర్శ కాలను సవరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి లేదని ప్రభుత్వం విడుదల చేసిన జీవోతో అర్థమవుతుందన్నారు. రైతులకు ప్రయోజనం చేకూరే విధంగా జీవోను సవరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వర్ల వెంకటరెడ్డి, గుడికందుల సత్యం, సుంకరి సంపత్, పున్నం రవి, జి శ్రీకాంత్, రాయికంటి శ్రీనివాస్, గోరేమియా తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ అభివృద్ధి పనులపై ఏ విచారణకైనా సిద్ధమే..

- దమ్ముంటే విచారణ చేయించుకోండి
- మంత్రి 'పొన్నం'కు మేయర్ సునీల్‌రావు ఓపెన్ ఛాలెంజ్

కరీంనగర్ టౌన్, జూలై 16: కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో చేపట్టిన అభివృద్ధి పనులపై ఏ విచారణకైనా సిద్ధంగా ఉన్నామని, పరిజ్ఞానం లేకుండా అవినీతి జరిగిందంటూ ఆరోపిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులకు దమ్ముంటే ఏ విచారణనైనా చేయించుకోవాలని


మాట్లాడుతున్న సునీల్ రావు

నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు ఓపెన్ ఛాలెంజ్ చేశారు. నగరపాలక సంస్థ పాలకవర్గం విజిలెన్సు విచారణకు భయపడి కేంద్రమంత్రి బండి సంజయ్‌ని కలిశారంటూ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆ పార్టీ కార్పొరేటర్లు, ఆయన అనుచరులు ఆరోపించడం సిగ్గుచేటని తీవ్రంగా ఖండించారు. మంగళవారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మేయర్ మాట్లాడుతూ రాష్ట్రమంత్రిగా బాధ్యతలు తీసుకున్న పొన్నం ప్రభాకర్ ఎనిమిది నెలల్లో కరీంనగర్ నగరపాలక సంస్థకు ఒక్క నయాపైసా నిధులు తీసుకురాలేదని, దమ్ముంటే నగర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి 200 కోట్ల రూపాయలు తీసుకురావాలని సవాల్ విసిరారు. తీగెల వంతెన ఆర్‌అండ్‌బీ శాఖకు సంబంధించినదని, ఆర్‌అండ్‌బీ రోడ్లు దెబ్బతింటే మున్సిపల్‌ను బాధ్యత చేస్తూ మాట్లాడటం వారి అజ్ఞానానికి నిదర్శనమని అన్నారు. 2017 జూన్ 23న కేంద్ర ప్రభుత్వం స్మార్ట్‌సిటీగా ప్రకటించగా 2017 జూలై 31న స్పెషల్ పర్పస్ వెహికిల్ ఏర్పాటు చేసి 12 మంది బోర్డు ఆఫ్ డైరెక్టర్లతో స్మార్ట్‌సిటీకార్పొరేషన్ లిమిటెడ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. మున్సిపల్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చైర్‌పర్సన్‌గా, జిల్లా కలెక్టర్ డైరెక్టర్‌గా, మున్సిపల్ కమిషనర్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉండే ఈ కమిటీలో మేయర్‌గా ఒక డైరెక్టర్‌గా ఉన్నానని చెప్పారు. ఈ బోర్డు మీటింగ్‌లో చర్చించి ఆమోదం మేరకు పనులు చేయడంతో పాటు బిల్లులు కూడా చెల్లించడం జరుగుతుందన్నారు. అధికారులు నిబంధనల మేరకు పనులను పర్యవేక్షిస్తారని, అవినీతికి ఆస్కారం ఎలా ఉంటుందో వారికే తెలియాలని, ఒకవేళ ఏదైనా అవినీతి జరిగితే అందుకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. స్మార్ట్‌సిటీ నిధులు తెచ్చి అభివృద్ధి చేయడంలో బండి సంజయ్ పాత్ర ఉందని, నగర అభివృద్ధి కోసం ఎవరినైనా కలుస్తామని మేయర్ తేల్చిచెప్పారు. సమావేశంలో పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో.. భారీ నష్టం


హుజూరాబాద్‌లో మంటల్లో కాలి బూడిదవుతున్న దుకాణాలు

- హుజూరాబాద్‌లో 30కి పైగా కాలి బూడిదైన చిరు వ్యాపారుల దుకాణాలు
- కన్నీరుమున్నీరుగా రోధించిన వ్యాపారులు

హుజూరాబాద్, జూలై 16: ఓ వైపు వర్షం... మరోవైపు మంటలు చెలరేగి ప్రమాదవశాత్తు చిరువ్యా పారుల దుకాణాలు కాలి బూడిదైన సంఘటన మంగళవారం తెల్లవారు జామున హుజూరాబాద్‌లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హుజూరాబాద్ పట్టణంలోని పాపారావు బొంద వద్ద ఉన్న ఖాళీ స్థలంలో చిరు వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేశారు. యదావిధిగా సోమవారం రాత్రి దుకాణాలకు తాళాలు వేసుకొని ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో ఓ వైపు వర్షం పడుతుండగా, ప్రమాదవశాత్తు దుకాణాల నుంచి మంటలు చెలరేగాయి. చూస్తుండగానే 30పైకి పైగా దుకాణాలు కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. ఇది చూసిన చిరువ్యాపారస్తులు బోరున విలపించారు. మడిపల్లి సంధ్య అనే అరటిపండ్ల వ్యాపారి కాలి బూడిదైన తన షాపును చూసి స్పృహతప్పి పడి పోయింది. హుటాహుటిన 108వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించారు. దుకా ణంలో ఉన్న వస్తులను పూర్తిగా కాలి బూడిద కావడంతో లక్షల్లో నష్టం వాటి ల్లిందని కన్నీరు పెడుతూ రోధించారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్డీవో రమేష్‌బాబు, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమి షనర్ సమ్మయ్యలు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లనే ఈ ప్రమాదం జరిగిందా అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ. 50లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

● షార్ట్ సర్క్యూటా...? ఎవరైనా నిప్పటించారా...?

హుజూరాబాద్ పట్టణ నడిబొడ్డున జరిగిన అగ్నిప్రమాదంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయితే 30 దుకాణాలు కాలిపోవని పలువురు అంటున్నారు. ఒక వైపు వర్షం పడుతుంటే ఎలా మంటలు చెలరేగుతాయని పలువురు ఆరోపిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటిస్తే తప్ప భారీ ఎత్తున అగ్ని ప్రమాదం జరగదని దుకాణాదారులు, స్థానికులు వాపోతున్నారు. దీనిపై పోలీసులు సమగ్ర విచారణ జరిపితేనే అసలు విషయం బయట పడనుంది. దీనిపై ట్రాన్స్‌కో డీఈ లక్ష్మారెడ్డి, ఏఈ శ్రీనివాస్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించి షార్ట్ సర్క్యూట్ వలన ప్రమాదం జరగలేదని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

● బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే కౌశిక్, ప్రణవ్

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌లు హైద్రాబాద్ నుంచి హుటాహుటిన హుజూరాబాద్‌కు చేరుకున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రమాదంలో నష్టపోయిన బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నష్టపోయిన ఒక్కో బాధితుడికి రూ.10వేలు అందజేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రమాదంలో నష్టపోయిన బాధితులందరికీ ప్రభుత్వం తరుపున న్యాయం చేయించడంతో పాటు తనవంతు సహకారం అందిస్తానని వొడితెల ప్రణవ్ తెలిపారు. ప్రమాదం జరిగిన సంఘటన తెలియగానే ప్రముఖ సామాజికవేత్త సబ్బని వెంకట్ ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించారు. స్థానిక బీజేపీ నాయకులు అగ్నిప్ర మాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.


హుజూరాబాద్‌లో ప్రమాదంలో బూడిదైన దుకాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

● డివిజన్ పోలీసుల చేయూత

హుజూరాబాద్ పట్టణంలోని అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధి తులకు డివిజన్ పోలీసులు చేయూ త నిచ్చారు. ఈ సందర్భంగా 10మంది నిరుపేద చిరువ్యాపా రులకు రూ.3వేల చొప్పున ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వ ర్యంలో బాధి తులకు అందజేశారు. వీరిలో సీఐలు రమేష్, రవి, వెంకట్, కిశోర్, ఎస్‌ఐలు ఉన్నారు.




అగ్నిప్రమాదంలో కాలిన దుకాణాలు, పండ్లు

హౌసింగ్‌బోర్డుకు వరద ముప్పు

- 2018, 2021లో నీట ముగినిగిన ఇళ్లు
- నేటికి నిర్మించని వరద కాల్వ

జమ్మికుంట, జూలై 16: జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీవాసులు వర్షాకాలం వచ్చిందంటే బెబేలెత్తుతున్నారు. ఎడ తెరపి లేని వర్షం కురిసిందంటే ఆ రోజు వారికి కంటి మీద కునుకు ఉండదు. గత నాలుగేళ్ల వ్యవధిలో రెండు సార్లు హౌసింగ్‌బోర్డు నీట మునిగింది. 2018సంవత్సరంలో కురిసిన భారీ వర్షానికి మూడు వందల ఇళ్లు నీట మునిగాయి. ఇళ్లలోని నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర సామగ్రి వరద నీటి పాలయ్యాయి. కట్టు బట్టలతో సమీప బంధువులు, సన్నిహితుల ఇళ్లకు వెళ్లి తల దాచుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. ఆ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి బాధితులకు ఎలాంటి నష్టపరిహారం అందలేదు. కాలనీ సందర్శించిన ఉన్నతాధికారులు వరద నీరు నిలిచి ఉండటానికి కారణాలు తెలుసుకున్నారు. వరద కాల్వ నిర్మాణానికి రూ.35లక్షల నిధులు కేటాయించారు. 2020లో వరద కాల్వ నిర్మాణం పూర్తి అయింది. 2021లో మళ్లీ భారీ వర్షం కురవడంతో మూడు వందల ఇళ్ల మేర నీట మునిగాయి. హుజూరాబాద్ ఉప ఎన్నిక సమయం కావడంతో మంత్రులు, ఎమ్మెల్యేలు స్థానికంగా ఉండటంతో అధికార యంత్రాంగం మొత్తం కదిలి వచ్చింది. వరద నీటి ఉధృతి తగ్గే వరకు సహాయ చర్యలు చేపట్టారు. కాలనీలోని పార్కు నుంచి ఏడు ఫీట్ల వెడల్పుతో కాల్వ తీయడంతో వరద నీరు వెళ్లి పోయింది.


హౌసింగ్‌బోర్డు కాలనీలోకి చేరిన వరద నీరు (ఫైల్)


ఇంట్లోకి చేరిన వరద నీరు (ఫైల్)

● కలెక్టర్ ఆదేశించినా మంజూరు కాని నిధులు

2021లో కాలనీ నీట మునిగిన సమయంలో అప్పటి జిల్లా కలెక్టర్ సందర్శించారు. గతంలో నిర్మించిన వరద కాలువ సరిపోవడం లేదని మరో వరద కాల్వ నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్పందించిన ఇంజనీరింగ్ విభాగం అధికారులు రూ.53లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి అప్పటి ప్రభుత్వానికి అందజేశారు. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు. 2023లో వరద కాల్వకు నిధులు కేటాయించాలని కౌన్సిలర్ శ్రీపతి నరేష్ మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. వర్షాకాలం వస్తేనే ప్రజా ప్రతినిధులు, అధికారులకు హౌసింగ్‌బోర్డు గుర్తుకు వస్తుందని, తర్వాత ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి త్వరగా వరద కాల్వ నిర్మాణ పనులు చేపట్టి తమను గండం నుంచి గట్టెక్కించాలని వేడుకుంటున్నారు.

అంజన్న సేవలో న్యాయమూర్తులు



కొండగట్టులో న్యాయమూర్తి మహేష్‌నాథ్

మల్యాల, జూలై 16: కొండగట్టు ఆంజనేయస్వామిని మంగళవారం పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. సిద్దిపేట జూనియర్ సివిల్ జడ్జి పి.చందన, మల్కాజిగిరి సీనియర్ సివిల్ జడ్జి జీవీ మహేష్‌నాథ్ వేర్వేరుగా స్వామి వారిని దర్శించుకున్నారు. న్యాయమూర్తులకు అధికారులు, అర్చకులు స్వాగతం పలుకగా స్వామి సన్నిధిలో పూజలు నిర్వహించారు. అనం తరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈవో చంద్రశేఖర్ తదితరులు సత్కరించారు.

● అంజన్నను దర్శించుకున్న పూర్ణ



స్వామివారి సన్నిధిలో పూర్ణ

ఎవరెస్ట్ శిఖరం అధిరోహించిన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన పూర్ణ మంగళవారం కొండగట్టుకు వచ్చి ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణను ఆశీర్వదించారు

రుణమాఫీ జీవోను సవరించాలి

జమ్మికుటం,జూలై 16: రుణమాఫీ జీవోను రైతులకు ప్రయోజనకరంగా ఉండేలా సవరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు చెల్పూరి రాజు అన్నారు.పట్టణంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 2 లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక ఇచ్చి హామీలను విస్మరిస్తూ జీవోల పేరిట అయోమయా నికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. రేషన్ కార్డు ఆధారితంగా ఉన్నవారందరినీ ఒకే కుటుంబంగా పరిగణించి కుటుంబంలో ఒక్కరికే రుణమాఫీ చేస్తే కుటుం బం నుంచి విడిపోయిన వారికి రుణమాఫీ వర్తించదన్నారు. పది సంవత్సరాలుగా రైతులు రుణాలు తీసుకొని వడ్డీలు పెరిగి ఇబ్బంది పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం రుణమాఫీ సరిగా చేయకపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారన్నారు. ప్రతి రైతుకు రుణమాఫీ అయ్యేలా చూడాలని అన్నారు.

పంచాయతీ నిధులను కార్మికుల వేతనాలకే కేటాయించాలి

జమ్మికుంట,జూలై16: ప్రభుత్వం విడుదల చేసిన పంచాయతీ నిధులను కార్మికుల వేతనాలకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్ ద్వారా విడుదల చేసిన నిధులలో మొదటి ప్రాధాన్యతగా గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని అన్నారు. జిల్లాలో నాలుగు కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ మండల కార్యదర్శి రవీందర్‌రావు, ఆసాల సారయ్య, రవి ఉన్నారు.

రూ.7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట,రూరల్16: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ. 7,450 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు ఇద్దరు రైతులు తొమ్మిది క్వింటాళ్ల పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర.7,450 కనిష్ఠ ధర రూ.7,200 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

ఫేక్ మెసేజ్‌తో మోసం చేసిన వ్యక్తి అరెస్టు

జగిత్యాల టౌన్, జూలై 17: బట్టల షాపులో చీరెలు కొని రూ.10 వేలు ఫోన్ పే ద్వారా డబ్బులు పంపినట్లు ఫేక్ మెస్సేజ్ చూపించి మోసం చేసిన వ్యక్తిని మంగళవారం జగిత్యాల పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. జగిత్యాలలోని ఓ బట్టల దుకాణంలో ఈ నెల 12న నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి మోసానికి పాల్పడ్డాడు. అదే రోజు బాధితురాలు జగిత్యాల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. మంగళవారం టౌన్ సీఐ వేణు గోపాల్ ఆధ్వర్యంలో పోలీసులు విద్యానగర్ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఓ వ్యక్తి పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. విచారణలో ఇటీవల జగిత్యాల పట్టణంలో ఫేక్ మెస్సేజ్‌తో రూ. 10 వేలు మోసం చేసిన వ్యక్తిగా గుర్తించారు. నిందితుడు మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్ మండలం రాపల్లికి చెందిన రామగిరి సురేష్‌గా గుర్తించి అతని వద్ద రూ. 5 వేల నగదుతో పాటు ఒక సెల్‌ఫోన్, నెంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ వివరించారు. నిందితుడిపై ఇదివరకే నిర్మల్ జిల్లాలోని నిర్మల్ టౌన్‌తో పాటు మంచిర్యాల జిల్లా నెన్నెల, జగిత్యాల జిల్లా సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు కేసులు నమోదైనట్లు వివరించారు.

మద్యం మత్తులో ఒకరి ఆత్మహత్య

రుద్రంగి, జూలై 16: రుద్రంగి మండల కేంద్రంలోని నేవూరిపల్లెకు చెందిన నేవూరి అంజయ్య(28) మద్యం మత్తులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అంజయ్య మద్యానికి బానిసై నిత్యం తాగి వచ్చి భార్యను కొట్టేవాడు. కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన అంజయ్య పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఉయ్యాలకు సోమవారం రాత్రి ఉరేసుకున్నాడు. అంజయ్య భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం

వీర్నపల్లి, జూలై 16: రుద్రంగి మండలం చింతామణి తండాకు చెందిన గుగులోత్ హరిసింగ్(60) అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. రుద్రంగి మండలం చింతమణితండాకు చెందిన గుగులోత్ హరిసింగ్ శనివారం భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాల్లో వెతికారు. హరిసింగ్ ఆచూకీ లభించలేదు. భార్య గుగులోత్ దేవి రుద్రంగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

గట్టుదుద్దెనపల్లిలో చోరీ

మానకొండూర్, జూలై 16 : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో మంగళవారం దొంగతనం జరిగింది. స్థానిక సీఐ రాజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆకుల భారతమ్మ అనే మహిళ ఐదు రోజుల క్రితం కనపర్తి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. మంగళవారం ఇంటికి వచ్చిన మహిళ ఇంటి తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు పగుల కొట్టి ఉండడాన్ని గమనించి లోపలికి వెళ్లి చూసినట్లు తెలిపారు. ఇంటిలోని బీరువాను పగుల కొట్టి అందులోని రెండు తులాల చంద్రహారం, పట్టగొలుసులు దొంగిలించుకపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన ఆర్టీసీ డ్రైవర్ మృతి


మనోహర్‌రెడ్డి (ఫైల్)

కరీంనగర్ అర్బన్, జూలై 16: ఆర్టీసీ కరీంనగర్- 1 డిపో డ్రైవర్‌గా పని చేస్తున్న చిట్యాల మనోహర్‌రెడ్డి (55) ఈనెల 7న ఆత్మ హత్యకు యత్నించి చికిత్స పొందుతూ మంగళ వారం మృతి చెందాడు. మనోహర్‌రెడ్డి 7వ తేదీ మధ్యాహ్నం విధులకు హాజరైన సమయంలో ఆర్టీసీ అధికారులు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వ హించగా ఆల్కహాల్ శాతం 21 వచ్చింది. దీంతో డ్యూటీ చేయడానికి నిరాకరించిన అధికారులు నోటీసులు జారీ చేసి సస్పెండ్ చేశారు. మనస్థాపం చెందిన డ్రైవర్ మనోహర్‌రెడ్డి వన్ డిపోలో బాత్ రూములో పురుగుల మందు తాగి పడి పోయి ఉండగా తోటి ఉద్యోగులు చూసి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. చికిత్స పొందుతున్న మనోహర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. దీంతో కుటుంబసభ్యులు, ఆర్టీసీ కార్మికులు మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. అప్పటి వరకు మృతదేహానికి పోస్టు మార్టం చేసేందుకు నిరాకరించారు. దీంతో ఆర్టీసీ పీఓ చంద్రయ్య, డిప్యూటీ ఆర్‌ఎం (మెకానికల్) సత్యనారాయణలు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మృతుడి కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇచ్చే విషయం తమ పరిధిలో లేదని, ఉన్నతాధికారులకు రెకమండ్ చేస్తామని ఆర్టీసీ ఉద్యోగ సంఘ నాయకులకు, మృతుడి కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు పంచనామా చేసి పోస్టుమార్టం నిర్వహించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఎండపల్లి, జూలై 16: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన రాయమల్లు (42) అనే యువకుడు మంగళవారం ఉదయం ఇంట్లో ఉరేసు కుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన రాయమల్లు గతంలో పది సంవత్సరాలు సింగాపూర్ వెళ్లి ఇంటికి తిరుగొచ్చి పంచర్ కొట్టు నిర్వ హించుకుంటూ జీవిస్తున్నాడు. రాయ మల్లు తండ్రి గతంలోనే మృతి చెందాడు. తల్లి మానసిక పరిస్థితి సరిగ్గా ఉండదు. ఇద్దరు కూతుళ్ల, భార్యతో పాటు తల్లిని పోషిస్తూ ఉండేవాడు. తనకు ఏ ఆపదొచ్చినా వెనకా ముందు ఎవరూ లేరని తరచూ తన భార్యతో చెప్పుకుంటూ మానసికంగా కృంగిపోయేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఉద యం భార్యను నిద్ర లేపిన రాయమల్లు ఇంట్లోనే కాసేపటికి ఉరేసు కుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిద్రలోంచి లేచిన పిల్లలు ఒక్కసారిగా తండ్రిని చూసి షాక్‌కు గురయ్యారు. అమ్మా నాన్నకు ఏమైంది. పిలిస్తే మాట్లాడుత లేదు అంటూ తల్లితో రోదించిన తీరు అక్కడున్న వారిని కన్నీళ్లపెట్టించింది. భార్య స్వరూప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

లాభాల బాటలో ఆర్టీసీ లాజిస్టిక్స్

● ఏటా పెరుగుతున్న ఆదాయం ● పది కోట్లకు చేరువలో సంవత్సర ఆదాయం


పార్సిల్స్ బుక్‌చేరుకోవడానికి వేచి ఉన్న కస్టమర్లు

భగత్‌నగర్, జూలై 16: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులను చేరవేయడంతో పాటు ఆదాయ వనరులను అన్వేశిస్తున్నది. లాభాలు అంతంత మాత్రంగానే ఉన్న ఆర్టీసీకి జవసత్వాలు అందించేందుకు ఆర్టీసీలో కార్గో, లాజిస్టిక్స్‌ను 2020 సంవత్సరంలో ప్రవేశ పెట్టారు. ఆర్టీసీ కరీంనగర్ రీజియన్‌లో 11 డీఓలు కరీంనగర్-1, కరీం నగర్-2, గోదావరిఖని, మంథని, జగిత్యాల, కోరుట్ల,మెట్‌పల్లి, సిరిసిల్ల, వేములవాడ, హుజూరాబాద్, హుస్నాబాద్ డిపోలున్నాయి. నిత్యం ఆర్టీసీ బస్సులు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు వెళ్తుండడాన్ని దృష్టిలో ఉంచుకుని పార్సిల్స్, పార్సిల్ కవర్స్ ప్రజలు తమకు సంబంధించిన వారికి వస్తువులను ఆర్టీసీ ద్వారా పంపిస్తుండడంతో ఆర్టీసీ లాజిస్టిక్స్ లాభాల బాటలో పయనిస్తున్నది.


బార్‌కోడ్ ద్వారా వస్తువులను పరిశీలిస్తున్న సిబ్బంది

రీజియన్ వ్యాప్తంగా ఏటా పెరుగుతున్న ఆదాయం

రీజియన్ వ్యాప్తంగా 2020-21 సంవత్సరంలో 3,41,905 పార్సిల్స్ బుక్ చేసి 3,00,00,980 రూపాయలను ఆర్జించారు. 2021-22సంవత్సరంలో 5,40,728 పార్సిల్స్ బుక్‌చేసి 5,56,38,384 రూపాయలు ఆర్జించారు. 2022-23 సంవత్సరంలో 5,80,651 పార్సిల్స్ బుక్‌చేసి 7,47,62,857 రూపాయలు, 2023-24 సంవత్సరంలో 5,92,212 పార్సిల్స్ బుక్‌చేసి 9,32,99,988 రూపాయలు ఆర్జించారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 2024 నుంచి జూన్ వరకు 1,33,047 పార్సిల్స్ బుక్‌చేసి 2,34,96,206 రూపాయల ఆదాయాన్ని అర్జించారు.

రీజియన్‌లోని వివిధ డిపోల్లో వచ్చిన ఆదాయం

కరీంనగర్ రీజియన్‌లో 11 డిపోల్లో 2023-24 సంవత్సరంలో ఏటా లాజిస్టిక్స్ ఆదాయం పెరుగుతూ 9,32,99,988 రూపాయల ఆదాయం సమకూరింది. గోదావరిఖని డిపోలో 68,671 పార్సిల్ బుక్ చేసి 1,10,37, 640 రూపాయలు, హుస్నాబాద్ 11,138 పార్సిల్స్‌కు 15,31,046 రూపాయలు, హుజూరాబాద్ 20,645 పార్సిల్స్‌తో 37,15,332 రూపాయలు, కరీం నగర్-1 డిపోలో 2,98,823 పార్సిల్స్‌తో 4,67,46,316 రూపాయలు, కరీంనగర్-2 డిపోలో 11,549 పార్సిల్స్‌తో 27,16,433 రూపాయలు, మంథని డిపోలో 8,435 పార్సిల్స్‌తో 12,39,473 రూపాయలు వచ్చింది.

జగిత్యాల డిపోలో 63,872 పార్సిల్స్‌తో 86,27,859 రూపాయలు, కోరుట్ల డిపోలో 19,788 పార్సిల్స్‌తో 27,57,522 రూపాయలు, మెట్‌పల్లి డిపోలో 21,046 పార్సిల్స్‌తో 27,48,054 రూపాయలు, సిరిసిల్ల 55,453 పార్సిల్స్‌తో 1,04, 58,060, వేములవాడ 12,792 పార్సిల్స్‌తో 17,22,253 రూపాయల ఆదాయం వచ్చింది. మొత్తానికి 2020-21 నుంచి నేటి వరకు ప్రతి సంవత్సరం ఆర్టీసీ లాజిస్టిక్స్ ఆదాయం ప్రతి ఏటా రెండు కోట్ల మేర పెరుగుతూ వస్తున్నది. ప్రయాణికులను చేరవేయడంతో పాటు పార్సిల్స్, కార్గో ద్వారా వస్తువులను చేరవేస్తూ ఆర్టీసీ ప్రజల మన్ననలు పొందుతున్నది.

కొత్త సాఫ్ట్‌వేర్‌తో సులభతరం: లాజిస్టిక్స్ ఏటీఎం సదాశివ్



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రారంభించిన కార్గో, లాజిస్టిక్ సేవలతో ప్రయాణికులకు మరింత చేరువయ్యాం. కొత్తగా ప్రవేశపెట్టిన సాఫ్ట్‌వేర్‌తో పార్సిల్స్ వస్తువులను ప్రయాణికులను సులభంగా చేరవేస్తున్నాం. బార్‌కోడ్ సిస్టంతో వస్తువులను సులభంగా తెలుసుకునే వీలుంది. బస్సులు చేరుకునే సమయానికి పార్సిల్స్ ప్రజలకు అందుతుండడంతో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్నది. ఈ సంవత్సరం 11 కోట్ల మేర ఆదాయం రాబట్టాలన్నదే లక్ష్యంగా నిర్ణయించుకున్నాం.


పార్సిల్స్‌ను సిస్టంలో పరిశీలిస్తున్న సిబ్బంది

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

● 11 తులాల బంగారం, రూ. 4లక్షల నగదు ఆహుతి
● తప్పిన ప్రాణాపాయం

వెల్గటూర్, జూలై 16: మండలంలోని పైడిపల్లిలో గాదెనవేని మల్లయ్య ఇంటిలో మంగళవారం విద్యుదాఘాతంతో ప్రమాదం సంభవించింది. ఎస్సై ఉమా సాగర్ తెలిపిన వివరాల ప్రకారం మల్లయ్యకు ముగ్గురు కుమారులు, కూతురు ఉన్నారు. మల్లయ్యతో పాటు అతని చిన్న కుమారుడు గాదెనవేని సత్తయ్య, కోడలు మమత కలిసి ఒకే ఇంటిలో ఉంటున్నారు. పెద్ద కుమారుడు రమేష్ కొత్తగా ఇల్లు కట్టుకోవడం వలన వారికి సంబంధించిన వస్తువులు తండ్రి మల్లయ్య ఇంటిలోనే పెట్టాడు. మంగళవారం ఇంటిలో ఎవరి పనులకు వారు వెళ్లిన సమయంలో ఇంట్లో విద్యుదాఘాతంతో మంటలు వ్యాపించాయి. ఇంటిలో ఉన్న బట్టలకు, వడ్ల పరదాలకు మంటలు అంటుకొని ఇళ్లంతా వ్యాపించాయి. ఈ సంఘటనలో రమేష్‌కు చెందిన రూ.2 లక్షల నగదు, టీవీ, ఫ్రిజ్‌లు అగ్నికి కాలిపోయాయి. చిన్న కొడుకు సత్తయ్యకు చెందిన రూ. 2 లక్షల నగదు, అతని భార్యకు చెందిన 5 తులాల బంగారు ఆభరణాలు, మల్లయ్య కూతురుకు చెందిన 5 తులాల బంగారు ఆభరణాలు పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో మొత్తం రూ.4 లక్షల నగదు, 11 తులాల బంగారు ఆభరణాలతో పాటు బట్టలు, వివిధ ఎలక్ట్రానిక్ వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే గ్రామస్థులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వారు వచ్చి మంటలు ఆర్పివేశారు. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగి పోయింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తంగళ్లపల్లి, జూలై 16: తంగళ్లపల్లి మండల కేంద్రంలో ట్రాక్టర్, కారు ఢీ కొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ట్రాక్టర్ (ట్రాలీ లేకుండా)పై డ్రైవర్‌తోపాటు మరో వ్యక్తి వెళ్తున్నారు. అతి వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ పైకూర్చున్న తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మునిగే ప్రభాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ కార్డు లేకున్నా రూ.2 లక్షల రుణమాఫీ

● బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వడ్డీ మాఫీ అమలు కార్యక్రమంగా రుణమాఫీ ● ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్, జూలై 16: రేషన్ కార్డు ఫ్యామిలీ యూనిట్ గుర్తింపు చేయడానికి తప్ప రుణమాఫీ అమలు చేయడానికి ఏ విధంగా అభ్యంతరం కాదని, రేషన్ కార్డు లేనివారు కూడా రూ.2 లక్షల రుణమాఫీ పొందే అవకాశం ఉందని ఎమ్మె ల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆనాడు యూపీఏ ప్రభుత్వం ఏకకాలంలో రూ.లక్ష రుణమాఫీ చేసిందని, మళ్లీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ హయాంలో రూ.2 లక్ష రుణ మాఫీ ఏకకాలంలో చేయడం హర్షించదగిన విషయమన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు పర్యాయాలు రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తామని పేర్కొన్నప్పటికీ అది విడతలవారీగా వచ్చేసరికి కేవలం వడ్డీ మాఫీ అమలు కార్యక్రమంగా మిగిలిపోయిందన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో ప్రభుత్వంపై కొంత ఆర్థిక భారం అని భావించినప్పటికీ రైతు సంక్షేమం ప్రధానం కాబట్టి రాహుల్‌గాంధీ వరంగల్ డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా ఏ విధమైన ఆంక్షలు లేకుండా కుటుంబం ఒక యూనిట్‌గా ఆగస్టు 15లోపు రూ.2 లక్షలు పూర్తి స్థాయిలో రుణమాఫీ అమలు చేసే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

రేషన్ కార్డు అనేది ఫ్యామిలీ యూనిట్‌ను గుర్తింపు చేయడానికి మాత్రమే. దీనిపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు క్లారిటీ ఇచ్చారన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దేశంలో ఎక్కడా కూడా రుణమాఫీ కార్యక్రమాన్ని అమలు చేపట్టడం లేదన్నారు. ఈరోజు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాలతోగానీ, చీడ పురుగులతోగానీ పంట నష్టపోతే వారిని ఆదుకునే విధంగా పంటల బీమా పథకం అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఎకరాకు రూ.7500 ఇచ్చే విధంగా ముందుకు వెళ్తుందన్నారు. సన్న రకం సాగు చేసే రైతుకు ప్రతి క్వింటాల్‌కు రూ.500 మద్దతు ధరకు అదనంగా ఇస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు మాసాల్లో రాయికల్ మండలంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి పూర్తి చేశామన్నారు. అనంతరం మండలంలోని లోక్యానాయక్ తండా, మంగ్యానాయక్ తండాలో శీత్లా భవానీ, తీజ్ పండుగ ఉత్సవాల్లో పాల్గొని దర్శించుకున్నారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి ఉన్నారు.

లింగన్నపేట ఆందోళనలో 23 మందిపై కేసు

గంభీరావుపేట, జూలై 16 : గంభీరావుపేట మండలం లింగన్నపేటలో ఇటీవల శ్రీనాథ్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకోగా మృతదేహంతో ఈ నెల 14న రోడ్డుపై ఆందోళన చేసిన ఘటనలో 23 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై రాంమోహన్ తెలిపారు. లింగన్నపేటకు చెందిన తుడుం శ్రీనాథ్ ఈ నెల 10న ప్రేమ వ్యవహారంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. చికిత్స పొందుతూ 13న మృతి చెందాడు. శ్రీనాథ్ ఆత్మహత్యకు ప్రేమికురాలు కారణమంటూ బంధువులు 14న అర్ధరాత్రి దాటాక రోడ్డుపై బైఠాయించారు. వాహనదారులకు ఇబ్బంది కలిగేలా చేయడంతోపాటు ఉదయం కూడా శ్రీనాథ్ మృతదేహంతో మరోసారి ఆందోళన చేశారని, పోలీస్‌ల విధులకు ఆటంకం కలిగించారని ఎస్సై రాంమోహన్ వెల్లడించారు.

శ్రీనాథ్ ఇంటి నుంచి మృతదేహాన్ని గాంధీ వద్దకు తెచ్చే క్రమంలో పోలీస్‌లను బలవంతంగా తోసేశారని, శాంతి భద్రతలకు ఆటంకం కలిగించారని తెలిపారు. ఈ సంఘటనలో 23 మందిపై కేసు నమోదు చేశామని, కేసు విచారణలో భాగంగా ఈసానిపల్లి శేఖర్, గంగి నరేష్, కొత్తపల్లి ప్రవీణ్‌ను రిమాండ్‌కు తరలించామని పేరొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ద్విచక్రవాహనం చోరీ

ఎల్లారెడ్డిపేట, జూలై 16: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని దుకాణం ఎదుట నిలిపి ఉన్న ద్విచక్రవాహనాన్ని మంగళవారం దొంగలు ఎత్తుకెళ్లారు. గొల్లపల్లిలోని కర్ర దుకాణం ఎదుట బైక్‌ను నిలిపి లోనికి వెళ్లి వచ్చే సరికి వాహనం కనిపించకుండాపోయింది. బైక్ చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తాళం పగులగొట్టి రెండు ఇళ్లల్లో దొంగతనం

14 తులాల బంగారం, 37 తులాల వెండి ఆభరణాలు చోరీ

కరీంనగర్ క్రైం, జూలై 16: కట్టరాంపూర్‌లోని వినాయకనగర్, వివేకానందనగర్‌లో సోమవారం అర్ధరాత్రి దొంగలు తాళం వేసిన రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఒకటో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వినాయకనగర్‌కు చెందిన టి.మంగ పంచాయతీరాజ్ శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నది.

ఆమెకు మంగళవారం ఉద్యోగ బదిలీ కోసం కౌన్సెలింగ్ ఉండటం తో ఈనెల 14న రాత్రి ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్ళింది. మంగళవారం పక్క ఇంటివారు మంగ ఇంటి తలుపులు తెరచి, తాళం పగులగొట్టి ఉందని ఫోన్‌లో ఆమెకు సమాచారం అందించారు. ఆమె కరీంనగర్‌లోని ఇంటికి చేరుకుని పరిశీలించగా కప్‌బోర్డులో భద్రపరిచిన 14.3 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే పక్క ఇంటి వారి బైక్‌ను కూడా దొంగ లు ఎత్తుకుపోయారు. వివేకానందనగర్‌లో పద్మ ఈ నెల 13న ఉదయం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని తన కొడుకు వద్దకు వెళ్లింది. ఆమె ఇంటి తాళం పగులగొట్టి ఉందని మంగళవారం స్థానికులు ఫోన్ చేయగా ఆమె కరీంనగర్‌కు వచ్చి చూసే సరికి ఇంటి బీరువాలో భద్రపరిచిన 17 తులాల వెండి ఆభరణలు కనపడలేదు. దొంగలు ఇంటిలో చొరబడి చోరీ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాధితుల ఫిర్యాదు మేరకు దొంగతనం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాలను కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ సరిలాల్, క్రైటీం పోలీసులు పరిశీలించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీ లిస్తున్నారు. క్లూస్‌టీంతో వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. నలుగురు దొంగలు చేతులకు గ్లౌస్, ముఖాలకు మాస్కులు వేసుకుని దొంగతనాలకు పాల్పడినట్లుగా పోలీసులు ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

హైనా దాడిలో లేగదూడ మృతి

చిగురుమామిడి, జూలై 16: మండలంలోని గాగిరెడ్డిపల్లిలో దేవునూరి వెంకటేశ్ అనే రైతుకు చెందిన లేగదూడ హైనా దాడిలో మంగళవారం మృతి చెందింది. గ్రామ శివారులో తన వ్యవసాయ బావి వద్ద పశువుల పాకలో పాడి అవులతో పాటు లేగ దూడను కట్టేసి సోమవారం సాయంత్రం రైతు వెంకటేశ్ ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం బావి వద్దకు వెళ్లి చూసే సరికి లేగదూడ మృతి చెంది ఉన్నది. తీవ్రంగా గాయపడ్డ లేగదూడను పరిశీలించగా హైనా దాడి అని నిర్ధారించినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ సస్నీళ్ల వెంకటేశం కోరారు. చిగురుమామిడి మండలంలో హైనా దాడులు పెరిగి పోతున్నాయని, దీంతో రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లడానికి భయ పడుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. హైనా దాడులను అధికారులు అరికట్టాలని డిమాండ్ చేశారు.

వాహనాల దొంగలను పట్టుకున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి, జూలై, 16 : మెట్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో వాహనాలను అపహరించిన ఇద్దరు దొంగలను మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై చిరంజీవిలు పట్టుకున్నట్లు డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. మంగళవారం పోలీసుస్టేషన్‌లో పట్టుకున్న దొంగలను చూపుతూ వివరాలను వెల్లడించారు. మండలంలోని చౌలమద్ది గ్రామానికి చెందని యాశాడ వెంకటి అనే రైతుకు సంబంధించిన మహేంద్ర ట్రాక్టర్ ట్రాలీని గ్రామ శివారులో జూన్ 29న ఉంచాడు. మండలంలోని రామా రావుపల్లి గ్రామానికి చెందిన పొన్నం రవీందర్‌గౌడ్ వ్యవ సాయం చేస్తూ ట్రాక్టర్ ట్రాలీలు కొంటూ అమ్ముతుండే వాడు. ట్రాక్టర్‌ల కోసం గ్రామాల్లో వెతుకు తుండగా చౌల మద్ది గ్రామ శివారులో ఉన్న యాశాడి వెంకటి ట్రాక్టర్ ట్రాలీని అపహరించాడు. అపహరించిన ట్రాలీకి రంగు మార్చి మరో చోట దాచాడు. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలోని మణికంఠ వైన్స్ వద్ద ఈ నెల 12న చెప్యాల శంకర్ తన ద్విచక్ర వాహనాన్ని నిలిపాడు. మల్లాపూర్ మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన మదికుంట మహేష్ అనే వ్యక్తి మద్యానికి బానిసై నిలిపిన ద్విచక్ర వాహనాన్ని అపహరించాడు. బాధి తుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై చిరంజీ విలు పట్టణంలోని బస్ డీపో సమీపంలో వాహనాల తనిఖీలు చేస్తుండగా అను మానాస్పదంగా కనిపించిన ఇద్దరిని పట్టుకుని విచారిం చగా వాహనాలను దొంగలించినట్లు ఒప్పుకున్నారు. అపహరించిన వాహనాలను వారి నుంచి స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు.


బొలెరో, ట్రాక్టర్ ఢీ ఇద్దరు మృతి


మహేష్, అభిషేక్ (ఫైల్)

ధర్మారం, జూలై 16: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామ శివారులో మంగళవారం తెల్లవారు జామున బొలెరో, ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ గ్రామ శివారులో బొలెరో, ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పైన ఉన్న కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం ఆర్నకొండ గ్రామానికి చెందిన సోమిడి అభిషేక్ (22) అక్కడికక్కడే మృతిచెందగా, ట్రాక్టర్ డ్రైవర్ చీకట్ల మహేష్ (30) ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. అలాగే తాండ్ర అశోక్‌కు అనే యువకుడికి గాయాలయ్యాయి. ట్రాక్టర్‌ను ఢీకొట్టిన మంచిర్యాలలోని ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన బొలెరో డ్రైవర్ తూర్పాటి రాజుపై మృతుడు మహేష్ తండ్రి పోచయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కట్టెలతో దాడి చేసి బంగారు, వెండి ఆభరణాల దోపిడీ

అనుమానితుల ఫొటోలు విడుదల చేసిన పోలీసులు


పోలీసులు విడుదల చేసిన అనుమానితుల ఫొటోలు

మల్యాల, జూలై 16: ఒంటరిగా ఉన్న ఓ వ్యక్తిపై గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు దాడి చేసి బంగారు, వెండి ఆభరణాలు, నగదుతో ఉడాయించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 9న జగిత్యాలరూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బండారి స్వామి కొడిమ్యాల మండలం నాచుపల్లికి వెలుతూ కొండగట్టు సమీపంలోని పెట్రోల్ బంక్ నుంచి క్వారీలకు వెళ్లే మార్గంలో ఆగాడు. ఒంటరిగా ఉన్నట్లు గుర్తించిన ఇద్దరు వ్యక్తులు కట్టెలతో వచ్చి స్వామిని కొట్టి అతని వద్ద గల బంగారం, వెండి, నగదు, సెల్‌ఫోన్ లాక్కొని పారిపోయారు. దీంతో బాధితుడు మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేయగా ఇద్దరు వ్యక్తుల ఆనవాళ్లను స్వామి తెలుపడంతో పోలీసులు అనుమా నితుల ఫొటోలను విడుదల చేశారు. ఈ ఫొటోలలో గల వ్యక్తుల వివరాలు తెలిస్తే తమకు సమాచారం అందించాలని తగిన పారితోషికం అందించనున్నట్లు సీఐ నీలం రవి, ఎస్సై నరేష్ ఈ సందర్భంగా తెలిపారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

ప్రాజెక్టులోకి 5,150 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 5,150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 13.485 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 22.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 436 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 7.826 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 1.861 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

ఒకరి రిమాండ్

సిరిసిల్ల క్రైం, జూలై 16: జిల్లాలోని తంగళ్లపల్లి మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన బాస ఎల్లవ్వ మెడలో నుంచి పుస్తెల తాడు చోరీ చేసిన మెదక్ జిల్లా గజ్వేల్‌కు చెందిన పర్వతం నర్సింహులును మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. మల్లాపూర్ గ్రామంలో ఎల్లవ్వ తన ఇంటి ముందు నిద్రపోతున్న సమయంలో ఈ ఏడాది జూన్ 21న సిద్దిపేట జిల్లా దుబ్బాకకు చెందిన మరో వ్యక్తితో కలిసి నర్సింహులు ద్విచక్రవాహనంపై వచ్చాడని, పుస్తెలతాడు తెంపుకొని పారిపోయాడని పేర్కొన్నారు. ఇదే సమయంలోనూ మల్లాపూర్ గ్రామంలో తాటిపల్లి బాలకిషన్, ఎడ్ల రమేశ్‌కు చెందిన మొబైల్ ఫోన్లు ఎత్తుకెళ్లారని తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో సాంకేతిక సమాచారం ఆధారంగా సిరిసిల్ల వైపు వస్తున్న నర్సింహులును అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. మూడు తులాల పుస్తెలతాడు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు, మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు చెప్పారు.

ఊర కుక్క దాడిలో బాలుడికి గాయాలు


దేవేందర్ (ఫైల్)

బీర్‌పూర్, జూలై 16: ఊర కుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలై స్పృహ కోల్పోయిన ఘటన బీర్‌పూర్ మండలంలోని మంగేళ గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. మంగేళ గ్రామంలోని గోండు గూడెంకు చెందిన పెంద్రం మారుతి ప్రతిభలకు ఇద్దరు పిల్లలున్నారు. పెద్ద కుమారుడు దేవేందర్ (7) సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఆడుకుంటుండగా ఊర కుక్క వచ్చి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. మొఖం, తల వెనుక భాగంలో, చెవి దగ్గరా గాయ పరచగా చెవి తెగింది. ఈ దాడిలో బాలుడు స్పృహ కోల్పోయాడు. సమీపంలో ఉన్న కాలనీ వాసులు గమణించి కుక్క దాడి నుంచి బాలుడిని రక్షించి జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

'ఆత్మ రక్షణకు కరాటే దోహదం'


పతకం సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, జూలై 16: ఆత్మరక్షణ కోసం కరాటే దోహదం చేస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలకు చెందిన పి.శ్రేయన్నారయణ్ బంగారు పతకం సాధించడం పట్ల అభినందించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ నగరం లోని ఇందిరాగార్డెన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో కుమేటేలో బంగా రు పతకం, కటా విభాగం రజత పతకం సాధించడం హర్షించదగిన విషయ మన్నారు. దీంతో పాటు హర్యానాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

'అల్ఫోర్స్'లో ఘనంగా డాజిల్ డే

కరీంనగర్ టౌన్, జూలై 16: నగరంలోని భగత్‌నగర్ అల్ఫోర్స్ ఈ-టెక్నో స్కూల్‌లో మంగళవారం ప్రపంచ డాజిల్‌డే ఉత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు సమాజంలో జరుగుతున్న మార్పుల గూర్చి తెలియ జేయాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శిం చిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

అద్విత స్కూల్‌కు ఇంటర్నేషనల్ కేంబ్రిడ్జ్ ఐజీసీఎస్ఈ గుర్తింపు


మాట్లాడుతున్న అద్విత స్కూల్ చైర్మన్ సొగాని కొమురయ్య

కరీంనగర్ టౌన్, జూలై 16: నగరంలోని భగత్‌నగర్‌లో 10 సంవత్సరాలుగా అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యనందిస్తున్న అద్విత ఇంటర్నేషనల్ స్కూల్‌కు ప్రముఖ కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం ఐజీసీఎస్ఈ ఆమోదిత గుర్తింపు లభించింది. మంగళవారం అద్విత ఇంటర్నేషనల్ స్కూల్, వివేకానంద విద్యానికేతన్ విద్యాసంస్థల అధినేత సొగాని కొమురయ్య మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచ ఖ్యాతిగడించిన కేంబ్రిడ్జ్ తమ పాఠశాలలకు అఫ్లియేషన్ (గుర్తింపు) ఇవ్వడం హర్షణీయమని అన్నారు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈతో పాటు వివిధ దేశాల విద్యార్థులతో పోటీపడేలా ఐజీసీఎస్ఈ కరికులం తోడ్పడుతుందని అన్నారు. ఇక్కడ పదోతరగతి పూర్తిచేసిన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో ఇంటర్, ఆపై విద్యను విదేశాలలో సులభంగా ప్రవేశాలు పొంది చదివేందుకు అవకాశముంటుందన్నారు. జిల్లాలోనే ప్రప్రథమంగా అద్విత ఇంటర్నేషనల్ స్కూల్‌కు అంతర్జాతీయ కేంబ్రిడ్జ్ ఐజీసీఎస్ఈ గుర్తింపు వచ్చిందని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అద్విత ఇంటర్నేషనల్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ సొగాని అనుదీప్ పాల్గొన్నారు.

'కోటా'లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

కరీంనగర్ టౌన్, జూలై 16: నగరంలోని కోటా ఇన్‌స్టిట్యూట్ రెసోనెన్స్ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో కోటా ఇన్‌స్టిట్యూట్ రెసోనెన్స్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఆరంభ్ 2024 ఆస్పియస్ బిగినింగ్ పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ డాక్టర్ డి.అంజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుదర్శన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'రాజకీయాల్లో విలువలు పాటించాలి'

కరీంనగర్ అర్బన్, జూలై 16: రాజకీయాల్లో విలువలు పాటించాలని సుడా చైర్మన్, నగరకాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. మొన్నటి వరకు ఎంపీగా బండి సంజయ్‌కుమార్ విఫలమయ్యాడని, కరీంనగర్ అభివృద్ధికి ఒక్క పైసా నిధులు తీసుకు రాలేదని మేయర్ సునీల్‌రావు ఆరోపించాడన్నారు. ఇప్పుడు నగర అభివృద్ధికి బండి సంజయ్‌కుమార్ వందల కోట్ల నిధులు తీసుకువచ్చాడని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై మేయర్ సునీల్‌రావు గతంలో మాట్లాడిన వీడియోను, ఇప్పుడు మాట్లాడిన వీడియోను చూపించారు. సమావేశంలో నాయకులు దన్న సింగ్, అబ్దుల్ రెహమాన్, షబానా మహమ్మద్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పదోన్నతులు కల్పించాలి


మాట్లాడుతున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ముస్కు తిరుపతిరెడ్డి

హుజూరాబాద్, జూలై 16: రాష్ట్ర ప్రభుత్వం జీవో 11, 12లను సవరించి బీఈడీ అర్హత కలిగిన ఉపాధ్యాయులకు ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పదోన్నతులు కల్పించా లని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ముస్కు తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం హుజూరాబాద్‌లో పీఆర్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 317 జీవో ప్రకారం నష్టపోయిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు ప్రభుత్వం బదిలీ చేయా లన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 4డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. అర్హులైన ఉపాధ్యాయులకు ఎంఈవో, జేఎల్‌గా ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి మర్రి జైపాల్‌రెడ్డి, పాకాల ప్రభా కర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఆగన్న, కృష్ణమూర్తి, మాధవరావు, సత్యం, రాంరెడ్డి, సహ దేవ్, సహదర్, కరుణాకర్‌రెడ్డి, ఎస్ దామోదర్‌రెడ్డి, రమేష్, భాస్కర్‌రెడ్డి, శ్రీని వాస్, శశి, శంకర్, జయప్రకాష్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఫొటో ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ

హుజూరాబాద్, జూలై 16: హుజూరాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఫోటో అండ్ వీడియో అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ నెల 26,27,28వ తేదీల్లో హైద్రాబాద్‌లో జరిగే ఫొటో ఎక్స్‌పో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాచర్ల రాజు, సిరి రవి, కేదార్‌రెడ్డి, తుమ్మ చందు, ఎండీ యాకుబ్‌అలీ, రాజేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్ట గండి పూడ్చిన అధికారులు

సైదాపూర్, జూన్ 16: సైదాపూర్ మండలంలోని వెన్కేపల్లి శివారులో గల తుమ్మ చెరువు కట్ట వర్షానికి గండి పడింది. ఈ విషయాన్ని రైతులు సైదాపూర్ తహసీల్దార్ మంజుల దృష్టికి తీసుకపోయారు. స్పందించిన తహసీల్దార్ చెరువు కట్ట గండి పడిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే కలెక్టర్ గండి పూడ్చాలని ఇరిగేషన్‌అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు మంగళవారం చెరువు కట్ట గండి పూడ్చి వేశారు. అధికారులకు రైతులు కృత జ్ఞతలు తెపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ వర్కినిస్పెక్టర్ రాజలింగం, పంచాయతీ కార్యదర్శి తురుమల, ఆర్ఐ శరత్, కారోబారి గడ్డం రమేష్ పాల్గొన్నారు.

గంగాధరలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

గంగాధర, జూలై 16: గంగాధరలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తానని విద్యా ర్థులకు ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఇచ్చిన హామీని నెరవే ర్చాలని బీజేపీ దళిత మోర్చా జిల్లా అధికార ప్రతినిధి మల్యాల వినయ్‌సాగర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన గంగాధర ప్రభుత్వ జూనియర్ కళాశా లలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 కిలోమీటర్లు కరీంనగర్‌కు వెళ్లి డిగ్రీ చదవాలంటే ఇక్కడి ప్రాంత విద్యార్థులకు దూరమైనం దున ఇంటర్ వరకు చదివి ఆపేస్తున్నారన్నారు. ప్రభుత్వం కళాశాలను మంజూ రు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత మోర్చా మండలాధ్యక్షుడు తాళ్ల శేఖర్, నాయకులు దాసరి ఆంజనేయులు, సర్వు శ్రీనివాస్, ఆకుల మనోహ ర్,మహేష్, తిరుపతి, శ్రీకాంత్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


ట్రైనీ కానిస్టేబుళ్లకు అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

కరీంనగర్ క్రైం, జూలై 16: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచించారు. కరీంనగర్ పోలీసు శిక్షణ కేంద్రం(పీటీసీ)లో శిక్షణ పొందుతున్న కానిస్టేబుళ్ళకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీటీసీ ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాస్ అభ్యర్థన మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) ఆధ్వర్యంలో కీటక జనిత, ఇతర సీజనల్ వ్యాధులపై డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత, డిస్ట్రిక్ట్ మలేరియా అధికారి డాక్టర్ రాజగోపాల్‌రావు, సబ్ యూనిట్ ఆఫీసర్ రామనాథం కానిస్టేబుళ్లకు అవ గాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానంగా డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా తదితర వ్యాధులు దోమల ద్వారా వ్యాపి స్తాయని, నీరు నిల్వ ఉండడం వలన దోమలు అభి వృద్ధి చెంది ఈ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంద న్నారు. దోమలు వృద్ధి చెందకుండా నీటి నిల్వలను ప్రతి మంగళ, శుక్ర వారాలలో డ్రైడేను పాటించి, నీటి నిల్వలను పూర్తిగా తొలగించాలని సూచించారు. ఇంటి పరిసరాలలో పాడైపోయిన కూలర్లు, టైర్లు, మట్టి పాత్రలు, కొబ్బరి బొండలు తదితర వాటిలో వర్షపు నీరు నిలిచి, దోమలు వృద్ధి చెందుతాయన్నారు. వీటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. జ్వరం వచ్చిన వారు సమీపంలోని ఆరోగ్య కేంద్రము లేదా ఆశా కార్యకర్తను సంప్రదించి, రక్త పరీక్ష చేసుకొని, వ్యాధి నిర్ధారణ చేసుకుని, మందులు వాడాలని సూచించారు. వర్షాలు అధికంగా పడుతున్నందున ఈగలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. డయేరియా లేదా వాంతులు, విరేచనాలు అయినప్పుడు ఓఆర్ఎస్ వాడడం ద్వారా డీహైడ్రేషన్ కాకుండా జాగ్రత్త పడడం ద్వారా పిల్లలలో మరణా లను అరికట్టవచ్చన్నారు. వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే మల విసర్జన తర్వాత, భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్ర పరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్, డా.రాజగోపాల్‌రావు, రామనాథం పాల్గొన్నారు.

'సెయింట్ జార్జ్'లో కౌన్సిల్ ఎన్నికలు

భగత్‌నగర్, జూలై 16: నగరంలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల (సిబిఎస్ఈ)లో కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించారు. పాఠశాల సోషల్ హెచ్ఓడి వైస్ ప్రిన్సిపాల్ టి ప్రసాద్ ఆధ్వర్యంలో పిల్లలకు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు ఎన్నికలు నిర్వహించారు. హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటి హెడ్ బాయ్, డిప్యూటి హెడ్ గర్ల్, స్పోర్ట్స్ కెప్టెన్, ఈవెంట్ అఫైర్స్ ఇన్‌ఛార్జి విభాగాలకు నామినేషన్లు తీసుకుని మూడు రోజులు ప్రచారం నిర్వహించి ఎన్నికలు నిర్వహించారు. ఓట్ల లెక్కింపు చేసి విజేతలను ప్రకటించారు. 91.5 శాతం విద్యార్థులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి రైట్ టు ఓటు గురించి విద్యార్థులకు వివరించారు. విజేతలుగా నిలిచిన అభిషేక్, ప్రేసి, జస్రజ్, సన్నిధి, అవినాష్, విశ్వలను అభినం దించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.నిరంజన్, అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'అమ్మమాట అంగన్‌వాడీ బాట' అవగాహన ర్యాలీ

భగత్‌నగర్, జూలై16: కొత్తపల్లి మండలం చింతకుంట శాంతినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అమ్మ మాట, అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. అంగన్ వాడీ కేంద్రంలో అంగన్‌వాడీల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ప్రదర్శన ద్వారా వివరిం చారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి తల్లులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఎంపీడీవో ప్రభు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్ అరుణ, ఏఎన్ఎం జుబేదాబేగం, ఆశకార్యకర్త సరోజ, అంగన్‌వాడీ టీచర్ జము, ఆయా మనమ్మ, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

● గణేష్‌నగర్: నగరంలోని 53వ డివిజన్ కశ్మీర్‌గడ్డ పరిధిలో మంగళవారం ర్యాలీని నిర్వహించి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించే కార్యక్రమాల గురించి తల్లులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ స్వప్న, ఏఎన్ఎం సంతోషిణి, అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, జ్యోతి పాల్గొన్నారు.

పారమిత విద్యార్థినికి అమెరికా నుంచి ఆహ్వానం

కరీంనగర్ టౌన్, జూలై 16: నగరంలోని పారమిత టెడ్ ఎడ్ క్లబ్‌కు చెందిన విద్యార్థిని కన్నం వర్షిణికి అక్టోబర్ 22 నుంచి 24 వరకు అమెరికాలోని అట్లాంటాలో నిర్వహించనున్న టెడ్ నెక్స్ సమావేశంలో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తూ ఆహ్వానాన్ని పంపించినట్లు టెడ్ క్లబ్ ఎడ్యుకేటర్ కె.హన్మంత రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ నలుమూలల నుంచి వేలాది దరఖాస్తులు అందుకున్న టెడ్ ప్రధాన కార్యాలయం మూడంచెల ఎంపిక విధానాన్ని ఎంచుకోగా మొదటి అంచెలోనే పారమిత టెడ్ క్లబ్ ఎడ్యుకేటర్ కె.హన్మంతరావు వర్షిణి, మధుమోహన్, శ్రీవల్లిని నామినేట్ చేయగా రెండవ అంచెలో ముగ్గురు విద్యార్థులు ఎంపికవగా, మూడవ సారి వర్షిణికి ఆహ్వానం అందిందని చెప్పారు. ఆమెను పారమిత అధినేత డాక్టర్ ఇ.ప్రసాద్‌రావు, డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనూకర్‌రావు, వియుఎం ప్రసాద్, రాకేశ్, వినోద్‌రావు, రమణ, హన్మంతరావు, ప్రిన్సిపాల్స్ అభినందించారు.

పవర్‌లూం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


అధికారికి వినతిపత్రం ఇస్తున్న పవర్ లూం యూనియన్ నాయకులు

కరీంనగర్ రూరల్, జూలై16: పవర్‌లూం యజమానుల, కా ర్మికుల సమస్యలను పరిష్కరిం చాలని సీఐటీయూ జిల్లా ఉపా ధ్యక్షుడు ఈ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ రూరల్ మండలం చెర్లబూత్కూ ర్, ఫకీర్‌పేట, ఎలబోతారం పవ ర్‌లూం కార్మికుల సర్వసభ్య స మావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలో పలు గ్రామాల్లో పవర్‌లూం పై 150మంది కార్మికులు 400 సాంచ లతో పని చేస్తున్నారని తెలిపారు. ఒక చీర ధర 65 రూపాయలు ఇస్తుండగా, ఒక మీటరుకు 8రూపా యల పడుతుందని రోజుకు 48 మీటర్ల బట్టలు నేస్తారని పేర్కొన్నారు. ఇప్పుడు పడుతున్న కూలీ రేటు మీటరుకు ఒక్క రూపాయి పెంచి ఇవ్వాలని పవర్‌లూమ్ కార్మికులు అనేక సంవత్సరాల నుండి డిమాండ్ చేస్తున్నారని తెలిపారు.

వల్లంపహాడ్, జూబ్లీనగర్, చెర్లబూత్కూర్, చామ నపల్లి, ఎలబోతారం గ్రామాల్లో ఎన్నో సంవత్సరా లుగా పవర్ లూమ్ మీదనే ఆధారపడి జీవనం కొ నసాగిస్తున్నారని తెలిపారు. వీరికి 20 సంవత్సరాల నుండి యజమానులతో కూలి రేట్లు రెండు సంవ త్సరాలకు ఒక్క సారి కూలీ ఒప్పందం జరుగుతుం దని , ఈ రోజుతో ఒప్పందం ముగిసిందని తెలి పారు. మళ్ళీ కొత్త రేట్ల ఒప్పందం కోసం యజమా నులు చర్చకు పలిచి మాట్లాడితే డిమాండ్ల పై వారు ఎలాంటి స్పందన లేదని తెలిపారు. కావున కార్మికులు పారిశ్రామిక వివాదాల చట్టం 1947 ప్రకారంగా సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని తెలి పారు. 15 రోజుల మందు పనులు నిలిపివేసి సమ్మెలోకి వెల్లడం జరిగిందని వెంటనే పవర్ లూమ్ యజమానులు కార్మికుల సమస్యలను పరి ష్కరించే విదంగా కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై ఇప్పటికే డిసిఎల్ అధికా రులకు, యజమానులకు తెలపడం జరిగిందని తెలిపారు. కార్మికులు చేస్తున్న న్యాయమైన కూలి రేట్ల ఒప్పందం కోసం అధికారులు, ప్రజాప్రతిని ధులు కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో తుమ్మ రాజమల్లు, గంగాధరి స్వామి రాజు, కార్మి కులు పాల్గొన్నారు.

'చెరువులను తలపిస్తున్న స్మార్ట్ సిటీ రోడ్లు'


రోడ్డుపై నీటి గుంత వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

కరీంనగర్ టౌన్/భగత్‌నగర్, జూలై16: నగరం లోని రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని 11వ డివిజన్ కట్ట రాంపూర్‌లో రోడ్లపై గుంతల్లో నిండిన నీటి వద్ద నిరసన కార్యక్రమంచేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ సిటి పనుల్లో భాగంగా రోడ్లు నిర్మిస్తామని చెప్పి తవ్వి వదిలి వేయడంతో ఆ గుంతల్లో వర్షం నీరు చేరి చెరువు లను తలపిస్తున్నా యన్నారు. గుంతలను పూడ్చలేని స్థితిలో నగర పాలక సంస్థ కార్పొరేటర్, మేయర్ ఉన్నా రన్నారు. నగరం లోని 60డివిజన్ల ఇదే పరిస్థితులు ఉన్నాయన్నారు. మరమ్మతులు చేయలేని మేయర్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పైడిపల్లి రాజు, కశిబోజుల సంతోష్‌చారి, మంద రాజ్ కుమార్, గడప శంకర్, మదర్ హోలీ, షరీఫ్, హనీఫ్, రామకృష్ణ, సందీప్, కాలనీవాసులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు


తిమ్మాపూర్‌లోని గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, జూలై16: గురుకుల పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మానకొండూర్ నియోజకవర్గంలోని గురుకుల పాఠశాలకు చెందిన పది, ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ర్యాంక్ సాధించిన విద్యార్థులతో పాటు ఆ తరగతి టీచర్‌కు స్వంతంగా లక్ష రూపాయల ప్రైజ్‌మని అందిస్తానని ప్రకటించారు. తిమ్మాపూర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను మంగళవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనా రాయణ సందర్శించారు. విద్యార్థులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమా వేశమై సమస్యలు తెలుసుకుని పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వం పల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో చదువుకొనే విద్యార్థులు అంతర్జాతీయ పాఠశాలల విద్యార్థులతో పోటీ పడి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాలల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకు వస్తే వెంటనే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోరపల్లి రమణరెడ్డి, ఎంపిడివో విజయ్ కుమార్ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మానకొండూర్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. మానకొండూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం వనమహోత్సవంలో పాల్గొన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణ తీసుకోవాలని అన్నారు. అంతకు ముందు పాఠశాల ఆవరణలో రూ.13.50లక్షలతో సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి భూమి పూజ చే శారు. కార్యక్రమంలో ఎంపిడివో రాజేశ్వర్‌రావు, డీసీసీ ప్రధాన కార్యదర్శి తాల్లపల్లి సంపత్, డీసీసీ అధికార ప్రతినిధి కొత్తకొండ శంకర్, జిల్లా కార్యదర్శి గసిగంటి సంపత్, మండల అధ్యక్షులు నందగిరి రవీంద్రాచారి, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం

వీణవంక,జూలై 16: మండలంలోని నర్సింగా పూర్, కనపర్తి, బేతిగల్, ఘన్ముక్ల, బొంతుపల్లి, కొండపాక, మల్లారెడ్డిపల్లి గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మొహర్రం తొమ్మిదో రోజు గ్రామాల్లో హిందూ ముస్లింలు ఐకమత్యంగా పీర్లకు మలిద ముద్దలు బెల్లం పానకంతో చేసిన షరబత్‌ను మట్టి కుండలలో చేసి ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

● ఇల్లందకుంట: మండలంలోని శ్రీరాములపల్లె గ్రామం లో పీర్ల పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. బుధవారం మొహర్రం పర్వదినం సందర్భంగా ముస్లింలు పీర్లను డప్పుచప్పుళ్ల మధ్య గ్రామంలో ఊరేగించారు. ప్రతి ఒక్కరూ పీర్లతో అలాయ్ బలాయ్ తీసుకొని కులమతాలకు అతీతంగా ప్రార్థించారు.

మున్నూరుకాపు మండల అధ్యక్షుడిగా కోల అనిల్‌కుమార్

గంగాధర, జూలై 16 : గంగాధర మండల మున్నూరుకాపు అధ్యక్షుడిగా గోపాల్‌రావుపల్లికి చెందిన కోల అనిల్‌కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ పటేల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తన నియమాకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు అనిల్ కృతజ్ఞత లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కమిటీలు వేసి సంఘ భలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం యువ నాయకులు పెంచాల పురుషోత్త, ఉప్పు ప్రశాంత్, రాసూరి సంజీవ్, చందిం మహేష్, రాసూరి తిరుపతి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాచిరెడ్డిపల్లిలో 'అమ్మమాట అంగన్‌వాడీ బాట'

గంగాధర, జూలై 16 : గంగాధర మండలం కాచిరెడ్డిపల్లిలో మంగళవారం ఐసిడీఎస్ ఆధ్వర్యంలో అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఇన్‌చార్జి సీడీపీ వో సౌందర్య మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో కూడిన విద్యనందిస్తున్నామని, తల్లిదండ్రులు చిన్నారులను దగ్గరలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసిడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, రేణుక,అంగన్‌వాడీ టీచర్ గౌతమి ఉన్నారు.

● చొప్పదండి: మండలంలోని కొలిమికుంటలో మంగళవారం అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ లావణ్యసుమలత,స్వప్న విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి

ఇల్లందకుంట, జూలై 16: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వాగొడ్డు రామన్నపల్లి గ్రామంలో మండల వైద్యాధికారి డాక్టర్ తులసీదాస్ ఆధ్వ ర్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, ఫైలేరియా, మెదడువాపు తదితర వ్యాధులు దోమల ద్వారా వ్యాపిస్తాయన్నారు. ప్రజలు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతిరోజు కాచి, చల్లార్చిన మంచినీరు తాగాలన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రై డే పాటించా లని గ్రామస్థులకు సూచించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ టైర్లు, కొబ్బరి బొండాలు తదితర వాటిలో ఉన్న నీటిని పారబోశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఏఎన్ఎం అరుణ, ఆశావర్కర్ ఎలంద్ర తదితరులు ఉన్నారు.

తొలి ఏకాదశి, మొహర్రం శుభాకాంక్షలు

-మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, జూలై 16: తొలి ఏకాదశి, మొహర్రం పండుగల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కరీంనగర్ రూరల్, జూలై16: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ అమలు విధానాలు ఖరారు చేసిన సందర్భంగా కరీంనగర్ మండలం నగు నూర్‌లో సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ, మాజీ సర్పంచ్ పెంచాల లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంతులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి స్వీట్లను పంచారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దావ సంపత్, దాసరి కన్నయ్య గడ్డల అజయ్, బత్తిని అంజయ్య తాండ్ర లక్ష్మణ్, అమిశెట్టి వీరేశం, హమీద్ పాషా పాల్గొన్నారు.

తొలి ఏకాదశి కరపత్రం ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, జూలై 16: స్థానిక తిరుమలనగర్ మయూరగిరి పీఠంలో (శ్రీనిలయం) బుధవారం జరిగే తొలి ఏకాదశి వేడుకల సందర్భంగా మంగళవారం మయూరగిరి పీఠాధిపతి నమిలకొండ రమణాచార్య స్వామి ప్రత్యేక కరపత్రాన్ని ఆవిష్కరించారు.

20 నుంచి పవిత్రోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, జూలై 16: నగరంలోని బొమ్మకల్‌రోడ్ యజ్ఞవరాహక్షేత్రంలో ఈనెల 20, 21, 22 తేదీల్లో వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సర్వవైదికసంస్థానంట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ, కుంభారాధన, అధివాసములు, ఆదివారం ఉదయం హోమం, స్నపన తిరుమంజనం, పవిత్ర సమర్పణ, గురుపూజా మహోత్సవం, సాయంత్రం మహాశాంతిహోమం, ఆస్థానం, దీపోత్సవం, తిరువీధి ఉత్సవం, సోమవారం ఉదయం సర్వదైవత్యహోమం, పూర్ణాహుతి, కళావాహనం ఉంటాయని పేర్కొన్నారు.

వైభవంగా శాకాంబరి ఉత్సవాలు

కరీంనగర్ రూరల్, జూలై16:కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో ఆలయ ధర్మాధికారి, వేద పండితులు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆషాడ శాకాంబరి ఉత్సవాలలో మంగళవారం అమ్మవారిని ఆలుచింతల మాలలతో అలంక రించారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

కరీంనగర్ రూరల్, జూలై16: కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సమత ఆధ్వర్యంలో హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ధరపురి సాగర్ పర్యావరణ హరితహారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు.

'నగరంలో అసంపూర్తిగా రోడ్లు'

కరీంనగర్ టౌన్, జూలై 16: కరీంనగర్‌లో అసంపూర్తిగా వదిలిపెట్టిన రోడ్లతో ప్రజలు పీకల్లోతు కష్టాల్లో కూరుకు పోయి ఇబ్బందులు పడుతున్నారంటూ బీఆర్ఎస్ పార్టీకి చెందిన 60వ డివిజన్ కార్పొరేటర్ వాల రమణారావు తవ్వి వదిలిపెట్టిన పీకలలోతు రోడ్డులో కూర్చొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. మంగళవారం 60వ డివిజన్ పరిధిలోని జ్యోతిబాపూలే పార్కు వెనుకభాగంలోని అసంపూర్తిరోడ్డులో స్థానికులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రమణారావు మాట్లాడుతూ సీఎం హామీ నిధులతో ఈ రోడ్డును అభివృద్ధి చేసేందుకు పాత రోడ్డును తవ్వి ఎనిమిది నెలలు అవుతుందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పనులు పూర్తి చేయాలని మేయర్, ఎమ్మెల్యేను కోరగా వారు కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి పనులు చేయాలని ఆదేశించినా బిల్లులు ఇప్పిస్తే తప్ప పనులు చేయమని చెప్పారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జగన్మోహన్‌రావు, సాయిరాం, ప్రవీణ్‌రావు, విజయరామారావు, శశాంక్, మల్లయ్య వెంకన్న, వెంకటరమణారావు, శ్యాం సుందర్, ఆజీమ్, కె.శ్రీనివాస్, ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో మెహందీ వేడుకలు

రామడుగు, జూలై 16: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలోని అల్ఫోర్స్ పాఠశాలలో మంగళవారం తొలి ఏకాదశి, మెహందీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చిన్నారుల చేతులకు గోరింటాకు మెహిందీ వివిధ డిజైన్లలో అందంగా అలకరించుకోవడం ఆహుతులను అలరించింది. వాతావరణంలో వచ్చే మార్పు లన వలన ఎలాంటి వ్యాధులకు గురికాకుండా గోరింటాకు ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను సందర్శించిన విద్యార్థులు

జమ్మికుంట రూరల్, జూలై 16: జమ్మికుంట పట్టణ పరిధిలోని ఆబాది జమ్మికుంటలో గల బిస్లరీ వాటర్ ప్లాంటును స్రవంతి జూనియర్ కళాశాల విద్యార్థులు మంగళవారం సందర్శించారు. వాటర్ బాటిల్స్ ప్యాకింగ్ విధానం, కార్మికులు ఆరోగ్యకరమైన వాతవరణంలో ఎలా పని చేస్తారని అడిగి తెలుసుకున్నారు. కళాశాల కరస్పాం డెంట్ డాక్టర్ పుల్లూరి సంపత్‌రావు, ప్రిన్సిపాల్ నడిపల్లి శ్రీనివాస్‌రావు విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ముదిరాజ్‌ల వినతి

సైదాపూర్, జూలై 16: ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కరించాలని మండల ముదిరాజ్‌లు తెలంగాణ ముది రాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేషం, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, జిల్లా ఉపా ధ్యక్షుడు రాయిశెట్టి చంద్రయ్య ఆధ్వర్యంలో మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తమ సమస్యలు, డిమాండ్‌లను మంత్రి దృష్టికి తీసుకెళ్లాల ని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

ముగిసిన వారాహి నవరాత్రులు

చొప్పదండి,జూలై16:చొప్పదండిలో శ్రీరాజశ్యామలా పూజాపీఠంలో నిర్వహిస్తున్న ఆషాడ గుప్త వారాహి నవ రాత్రులు మంగళవారం ముగిశాయి.పీఠ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ పోలోజు చరణాచార్యులు పూజలు చేశారు.

గీత కార్మికులకు రక్షణ

చొప్పదండి,జూలై16:కాటమయ్య పథకం గీత కార్మికు లకు రక్షణ కల్పిస్తుందని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.ప థకం ప్రవేశపెట్టినందుకు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఈ సందర్భంగా ఆయన దన్యవాదాలు తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

చొప్పదండి,జూలై16:చొప్పదండికి చెందిన వీణాదరి స్కూల్ విద్యార్థి హర్షవర్ధన్ బాసర ట్రిపుల్ ఐటికి ఎంపి కయ్యాడు.పదవ తరగతిలో పది జీపీ సాధించిన హర్షవను స్కూల్ కరస్పాండెంట్ తిప్పర్తి శ్రీనివాస్ అభినందించారు.

మాజీ జడ్పీటీసీ జన్మదిన వేడుకలు

మానకొండూర్, జూలై 16 : మానకొండూర్ మాజీ జ డ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ శాఖ అధ్యక్షులు పిట్టల మధు, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, నె ల్లి మురళి, సింగిల్ విండో అధ్యక్షులు నల్ల గోవిందరెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యులు ఎండీ అమీరుల్లాఖాన్ ఉన్నారు.